ఘనంగా బిర్సాముండా జయంతి

- నివాళులర్పించిన నాయకులు, అధికారులు



ఇచ్చోడ: నినాదాలు చేస్తున్న ఆదివాసీ నాయకులు

ఉట్నూర్‌రూరల్: ఆదివాసీ హక్కుల కోసం పోరాడిన యోధుడు వీర్ బిర్సాముండా పోరాటం స్ఫూర్తిదాయకమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో బిర్సాముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన స్ఫూర్తితో హక్కుల సాధన కోసం పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.

బోథ్: మండలంలోని సొనాల, చింతలబోరి గ్రామాల్లో ఆదివాసీ నాయకుడు బీర్సాముండా జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సొనాలలో పూలే వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, పూలే సొసైటీ చైర్మన్ గాజుల పోతన్న బీర్సాముండా చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆదివాసీల హక్కుల కోసం బ్రిటీష్ వారితో కొట్లాడిన గొప్ప వీరుడని కొనియాడారు. కార్యక్రమంలో సొసైటీ ప్రధాన కార్యదర్శి బత్తుల రమేశ్, అమృత్ రావ్ పాటిల్, కసిరె పోతన్న, అనిల్, భూమన్న, ఇస్రు పటేల్, శ్రీధర్, బాశెట్టి రమేశ్, లోలపు పోశెట్టి, భోజన్న పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద శుక్రవారం సాయంత్రం బిర్సాముండా జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి కొడప నగేశ్ మాట్లాడుతూ.. ఆయన స్ఫూరితో ఆదివాసీ యువత ముందుకు వెళ్లాలని కోరారు. కార్యక్రమంలో తుడుందెబ్బ డివిజన్ అధ్యక్షుడు ఆత్రం మహేందర్, కుమర కోటేశ్వర్, సిడాం దేవ్‌రావు, కాత్లే విఠల్ పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు గోండ్‌గూడ, ముత్నూర్, కేస్లాపూర్‌లో బీజేపీ, కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో భగవాన్ బిర్సాముండా జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదివాసీ సమాజం కోసం పోరాటం చేసి అమరుడైన బిర్సా ముండా జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం అభినందనీయమన్నారు.



బోథ్: నివాళులర్పిస్తున్న ఏఎంసీ చైర్మన్

నేరడిగొండ: మండలంలోని లఖంపూర్ బాలికల ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం స్వాతంత్ర సమర యోధుడు, ఆదివాసి ముద్దుబిడ్డ బీర్సాముండా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పాఠశాల సిబ్బంది పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాథోడ్ ఉత్తమ్ రావ్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉట్నూర్‌రూరల్: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

నార్నూర్: స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా జయంతిని శుక్రవారం నిర్వహించారు. మండల కేంద్రంలోని కుమురం భీం భవన్‌లో తుడుందెబ్బ ఆధ్వర్యంలో, మాన్కాపూర్‌లో మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తొడసం నాగోరావు, శ్రీసరస్వతి శిశు మందిర్ పాఠశాలలో బిర్సాముండా చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో తుడుందెబ్బ డివిజన్ అధ్యక్షుడు కనక ప్రభాకర్, మెస్రం మానిక్‌రావు, శ్రీరామ్, పూసం ఈశ్రు, తొడసం నాగోరావు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: స్వాతంత్ర్య సమరయోధుడు, జానపద నాయకుడు బిర్సాముండా జయంతిని శుక్రవారం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ ఎదుట గల బిర్సాముండా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డిలు మాట్లాడుతూ బ్రిటిష వలస వాదంపై పోరాడిన వారి స్ఫూర్తి ఎప్పటికీ ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆనంద్ రావు, సంతోష్ రావు, సిడాం రాంకిషన్, మెస్రం శంకర్, గెడం మాధవ్, గెడం వనిత, కుద్మేత ప్రకాష్, కుర్సేంగే తానాజీ పాల్గొన్నారు.



నేరడిగొండ: నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



నార్నూర్: పాల్గొన్న ఆదివాసీ సంఘాల నాయకులు



ఆదిలాబాద్‌రూరల్: నినాదాలు చేస్తున్న నాయకులు

క్లుప్తంగా

ముగిసిన కార్తికేయ దీక్షలు



ఉట్టి కొడుతున్న డీసీసీబీ చైర్మన్

తాంసి: భీంపూర్ మండల కేంద్రంలో గత నెల రోజులుగా కొనసాగుతున్న కార్తికేయ దీక్షలు శుక్రవారం ముగిశాయి. కార్తిక మాసాన్ని పురస్కరించుకొని భక్తులు 30 రోజుల పాటు దీక్షలు చేపట్టారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా కార్తికేయుడి పల్లకి ఊరేగించారు. ఇంటింటికీ తిరిగి తులసీ కల్యాణాలు నిర్వహించారు. అనంతరం డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి ప్రత్యేక పూజలు చేసి ఉట్టిని పగలగొట్టారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో మహాజన్ వెట్టి మనోహర్, వెట్టి దౌలత్, మోహన్ మహరాజ్, సిడాం రాంకిషన్, సిడాం పురుషోత్తం, లింబాజీ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఇచ్చోడ: వాహనాదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై తిరుపతి అన్నారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. రోడ్డు పనులు కొనసాగుతున్నందున ప్రైవేట వాహనదారులు రోడ్లపై వాహనాలను పార్కింగ్ చేయవద్దన్నారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూడాలి



రికార్డులు పరిశీలిస్తున్న అధికారి

బోథ్: హాస్టల్లో ఉంటున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అభివృద్ధి అధికారిణి సునీత అన్నారు. శుక్రవారం మండలంలోని కౌఠ(బి) గ్రామంలోని బీసీ వెల్ఫేర్ బాలుర హాస్టల్‌ను తనిఖీ చేశారు. హాస్టల్ రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని వార్డెన్ శ్యాంసుందర్‌కు సూచించారు. హాస్టల్‌లో సీసీ కెమెరాలు పనిచేయడం లేదని, అందుబాటులోకి తీసుకురావాలన్నారు. స్టాక్ రిజిస్టర్ లేకపోవడంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈవో

ఆదిలాబాద్: గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ఆదిలాబాద్ ఎంఈవో సోమయ్య అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన సర్వస్వాలు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ శ్రీనివాస్, సిబ్బంది కిరణ్, వంశీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బాజీరావు బాబా సప్తాహం ప్రారంభం



పాల్గొన్న బాజీరావు బాబా శిష్య బృందం

బేల: మండల కేంద్రంలోని బాజీరావు బాబా ఆలయంలో శుక్రవారం ఆధ్యాత్మిక గురువు బాజీరావు సప్తాహ వేడుకలు ప్రారంభమయ్యాయి. ప్రధాన శిష్య బృందం ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, భజన సంకీర్తనలతో వేడుకలను ప్రారంభించారు. ఈ కార్యక్రమాలు వారం రోజుల పాటు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఆయా కాలనీల వారీగా బాబా చిత్రపటంతో పల్లకి ఊరేగింపు చేపడుతామన్నారు.

కలప పట్టివేత



కలపను పట్టుకున్న అటవీశాఖ అధికారులు

సిరికొండ: మండలంలోని కొండపూర్ గ్రామంలో గురువారం రాత్రి అక్రమంగా ఆటోలో తరలిస్తున్న రూ.60 వేలు విలువ చేసే కలపను పక్కా సమాచారం మేరకు అటవీశాఖ అధికారులు దాడి చేసి పట్టుకున్నట్లు ఎఫ్ఆర్‌వో స్వామి తెలిపారు. పట్టుకున్న కలపను ఇచ్చోడ అటవీశాఖ కార్యాలయానికి తరలించి, కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలి



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కంది

కైలాస్‌నగర్: త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు ముందుకు సాగాలని అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని ప్రజాసేవభవన్‌లో ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకాపూర్, అంకోలి పంచాయతీ పరిధిలోని కోలాంగూడ, కొత్తూర్, సొసైటీగూడ గ్రామస్తులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు గిమ్మ సంతోష్‌రావు, లోక ప్రవీణ్ రెడ్డి, బండారి సతీష్, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఆహ్వానం

నార్నూర్: గాదిగూడ మండలంలోని ఝరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈనెల 19న నిర్వహించే రక్తదాన శిబిరంలో పాల్గొనాలని శుక్రవారం ఆదివాసీ నాయకులు జిల్లా కలెక్టర్ రాజర్షిషాను కలిసి ఆహ్వానించినట్లు ఆదివాసీ ఉద్యోగుల సంఘం నాయకుడు మెస్రం శేఖర్ బాబు తెలిపారు.

దిగంబర్ స్వామీజీలకు స్వాగతం

నేరడిగొండ: జైన్ గురువు 108వ ప్రసన్న సాగర్‌జీ (దిగంబర్ స్వామీజీ) మెదక్ జిల్లా కొల్చారం నుంచి నాగపూర్, మహారాష్ట్ర మీదుగా భద్రీనాథ్ వరకు పాదయాత్ర చేపడుతున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం నేరడిగొండ మండలంలోని వాంకిడి గ్రామానికి చేరుకోగా వారికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు.

భక్తిశ్రద్ధలతో కార్తిక పౌర్ణమి



నేరడిగొండ: వడూర్‌లోని బ్రహ్మంగారి ఆలయం వద్ద..



శోభాయాత్రలో పాల్గొన్న జెడ్పీ మాజీ చైర్మన్ జనార్దన్, గ్రామస్తులు



తాంసి: ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు



బోథ్: రామాలయంలో దీపాలంకరణ

తాంసి/నార్నూర్/ ఉట్నూర్‌రూరల్ / బోథ్/నేరడిగొండ: మండలాల్లోని ఆయా గ్రామాల్లో శుక్రవారం భక్తిశ్రద్ధలతో కార్తిక పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. ప్రజలు తెల్ల వారుజాము నుంచే ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఇంటి ఆవరణలోని తులసీ చెట్టుకు పూజలు చేసి, తులసీ వివాహం జరిపించారు. నార్నూర్ మండలంలోని భీంపుర్ గ్రామంలో కాకడ హారతి ముగింపు కార్యక్రమంలో ఆదిలాబాద్ మాజీ జెడ్పీ చైర్మన్ జనార్దన్ పాల్గొన్నారు. జగదంబా మాత, సంత్ శ్రీసేవాలాల్ మహరాజ్, సంత్ రామారావు మహరాజ్ మందిరంలో బోగ్ బండారో పూజలు చేసి, శోభాయాత్ర చేపట్టారు.

‘బ్యాంకు ఏర్పాటు అడ్డుకుంటే ఊరుకోం’



ఆదివాసీ పెద్దలకు నచ్చచెబుతున్న ఎస్సై

ఇంద్రవెల్లి: మండలంలోని మారుముల గ్రామీణ ప్రజల సౌలభ్యం కోసం ముత్నూర్ గ్రామంలో ఏర్పాటు చేస్తున్న గ్రామీణ బ్యాంక్ బ్రాంచ్ ఏర్పాటును అడ్డుకుంటే ఊరుకోమని ముత్నూర్ గ్రామస్తులు హెచ్చరించారు. శుక్రవారం మార్కెట్‌బంద్ చేసి నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్సై సునీల్ గ్రామానికి చేరుకొని ఆదివాసీ పెద్దలతో మాట్లాడి నచ్చ చెప్పడంతో శాంతించారు. కొంత మంది స్వార్థ రాజకీయల కోసం అడ్డుకోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో ముత్నూర్ గ్రామపటేల్ హెరేకుమ్ర జంగు పటేల్, సిడాం భీంరావ్, మెస్రం వెంకట్‌రావ్, ఆర్క ఖమ్ము, కొట్నాక్ భారిక్‌రావ్, మెస్రం జ్యోతిరాం, మెస్రం నాగ్‌నాథ్, కుమ్ర కేశవ్‌రావ్, మడావి భీంరావ్, తొడసం సాగర్, ఆర్క జైరాం పాల్గొన్నారు.

‘ప్రభుత్వానికి వసతి గృహాలపై పట్టింపు లేదు’



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: వసతి గృహాలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టింపు లేదని బీఆర్ఎస్ నాయకుడు సాజిదొద్దీన్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. వసతి గృహాల్లో నెలకొన్న పరిస్థితులపై అధికార యంత్రాంగం దృష్టి సారించాల్సిన అవసరముందన్నారు. సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మైనార్టీల సంక్షేమానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం విశేష కృషి చేసిందని గుర్తు చేశారు. ఇకనైనా అనవసర విమర్శలు మాని అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి సారిచాలని హితవు పలికారు. సమావేశంలో నాయకులు యూనుస్ అక్బాని, సలీమ్ పాషా మోబిన్, పర్వీన్, అయ్యుబ్ పాల్గొన్నారు.

సోనాలలో ‘మహా’ సందడి



సొనాల పెట్రోల్ పంపు వద్ద వాహనాలు

బోథ్: బోథ్ మండలాన్ని ఆనుకుని ఉన్న మహారాష్ట్రలో ప్రస్తుతం ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. శుక్రవారం మహారాష్ట్రలోని కిన్వట్‌కు ఎన్నికల ప్రచారంలో ముఖ్య నాయకుడు వస్తుండటంతో సొనాల గ్రామంతో పాటు చుట్టూ పక్కల గ్రామాల నుంచి భారీగా జన సమీకరణ చేశారు. దీంతో సొనాలలో ఎన్నికల సందడి నెలకొంది. వాహనాలు పెట్రోల్ కోసం బారులు తీరాయి.

కష్టపడ్డారు.. ఉద్యోగం సాధించారు



రాథోడ్ కార్తీక్



సచిన్ రెడ్డి



హరికృష్ణ



అంకిత



సాయికృష్ణ



కమస్ వార్ సాక్షి



శివకుమార్

తాంసి/నేరడిగొండ: గ్రూప్ 4 ఫలితాల్లో పలువురు ప్రతిభ కనబరిచి ఉద్యోగాలు సాధించారు. తాంసి, భీంపూర్ మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన యువకులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. తాంసి మండలంలోని బండల్ నాగాపూర్ గ్రామానికి చెందిన సురుకుంటి సచిన్ రెడ్డి మున్సిపల్ డిపార్ట్‌మెంట్‌లో, పొన్నారి గ్రామానికి చెందిన మలపతి హరికృష్ణ మున్సిపల్ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా, భీంపూర్ మండలంలోని కరంజి(టి) గ్రామానికి చెందిన అంకిత, అదే గ్రామానికి చెందిన బక్కి సాయికృష్ణ రెవెన్యూలో ఉద్యోగం సాధించారు. అర్లి(టి) గ్రామానికి చెందిన కామస్ వార్ సాక్షి జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపికైంది. రామెల్లి శివ కుమార్ జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించాడు. వీరిని గ్రామస్తులు అభినందించారు. నేరడిగొండ మండలంలోని చిన్నబుగ్గారం గ్రామానికి చెందిన రాథోడ్ కార్తీక్ జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించాడు.

108లో ప్రసవం

సిరికొండ: మండలంలోని లచ్చింపూర్(కె) గ్రామానికి చెందిన దుర్గకు శుక్రవారం పురిటి నొప్పులు రావడంతో 108కు సమాచారం ఇచ్చారు. వెంటనే సిబ్బంది ఇంద్రవెల్లి మండలంలోని పిట్టాబోంగారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మగ బిడ్డకు జన్మనించింది. తల్లిబిడ్డలు ఆరోగ్యంగా ఉన్నారని, మెరుగైన చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఈఎంటీ సురేశ్, పైలెట్ గోపీనాథ్ తెలిపారు.

డయల్ యువర్ డీఎంకు స్పందన

ఆదిలాబాద్: ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో పరిధిలో శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి స్పందన లభించింది. డిపో మేనేజర్ కల్పన ప్రయాణికుల నుంచి వచ్చిన విజ్ఞప్తులు, ఫిర్యాదులు, సమస్యలను నమోదు చేసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

సన్మానం

ఆదిలాబాద్: రైల్వే బోర్డు సభ్యుడిగా నియామకమైన కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఉష్కం రఘుపతిని జిల్లా క్రీడా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం డీఎస్ఏ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన ఉద్యోగులు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి వచ్చిన టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్‌ను తెలంగాణ వాణిజ్య పన్నుల శాఖ నాన్ గజిటెడ్ ఉద్యోగుల సంఘం నాయకులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు.

గుడిహత్నూర్ ఎస్సై బదిలీ

ఆదిలాబాద్‌టౌన్: గుడిహత్నూర్ ఎస్సైగా పనిచేస్తున్న సయ్యద్ ఇమ్రాన్‌ను బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ గౌస్ ఆలం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉట్నూర్ డీఎస్పీకి అటాచ్ చేశారు. పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్న మహేందర్‌ను గుడిహత్నూర్ ఎస్సైగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

కలెక్టరేట్‌లో పంటల సాగు..





ఆదిలాబాద్ కలెక్టర్ క్యాంప్ కార్యాలయం పంటల సాగుకు కేరాఫ్‌గా నిలుస్తోంది. అన్నిరకాల కూరగాయలు, పంటలను సేంద్రియ విధానంలో సాగు చేస్తున్నారు. తక్కువ విస్తీర్ణంలో అధిక దిగుబడులను సాధిస్తూ జిల్లాకు వచ్చిన కొత్త కలెక్టర్లకు రుచికరమైన ఉత్పత్తులను అందిస్తున్నారు. చిక్కుడుకాయ, వంకాయ, కొత్తిమీర, పాలకూర, మెంతికూర వంటి ఆకుకూరలు ఇక్కడ సాగు చేస్తున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

అఖండ హరినామ సప్తాహ వేడుకలు



పల్లకితో భక్తుల శోభాయాత్ర

బేల: మండల కేంద్రంలోని స్థానిక విఠల్ రుక్మబాయి ఆలయంలో వారం రోజులుగా కొనసాగుతున్న అఖండ హరినామ సప్తాహ వేడుకల ముగింపును శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ప్రధాన వీధుల గుండా విఠల్ రుక్మబాయి చిత్రపటాలతో పల్లకిని ఊరేగించారు. భక్తులు పల్లకికి ప్రత్యేక పూజలు చేశారు. చివరగా ఆలయంలో కాలదహీ హండి నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.